క్లుప్తంగా

దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్



పెదపూడిలో దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడిలో దోమల నివారణకు జరుగుతున్న ఎబేట్ మందు పిచికారీని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ శాఖ ఉన్నత అధికారుల ఆదేశాలపై దోమల నివారణకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామన్నారు. మండలంలో 18 గ్రామాలకు గాను ఇప్పటి వరకు 11 గ్రామాల్లో దోమల నివారణకు మందు పిచికారీ కార్యక్రమాలు పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి డి.ఉషారాణి, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో సత్తా చాటిన లలిత



లలితను అభినందిస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని ఎస్.లలిత చిత్రలేఖనలో ప్రతిభ చూపింది. ఈ విషయాన్ని హెచ్ఎం ఎం.వీరభద్రరావు గురువారం విలేకరులకు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీలో వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు జరిగాయి. వీటిలో సీతానగరం ప్రభుత్వ హైస్కూల్ ఏడో తరగతి విద్యార్థిని ఎస్.లలిత చిత్రలేఖనంలో విజేతగా నిలిచింది. కలెక్టర్ ప్రశాంతి, నన్నయ వీసీ ప్రసన్నశ్రీ చేతుల మీదుగా మెమెంటో, సర్టిఫికెట్‌ను అందుకుంది. కాగా.. లలితను ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

పైడితల్లి అమ్మవారికి పూజలు



పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామ దేవతల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరంలో గురువారం జరిగిన తూర్పు కాపుల ఇలవేల్పు, గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి నూతన ఆలయ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆదాడి చిన సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, సత్తి వెంకటరెడ్డి, చింతా రామారావు పాల్గొన్నారు.

ఎండిపోయిన చెట్టు తొలగింపు



కోరుకొండలో చెట్టును తొలగిస్తున్న సిబ్బంది


మధురపూడి: కోరుకొండ మెయిన్ రోడ్డులోని ఎండిపోయిన నిద్రగన్నేరు చెట్టును బుధవారం తొలగించారు. ఈ చెట్టు వయసు సుమారు వందేళ్లకు పైగా ఉంటుంది. ఇప్పటి వరకూ ఎందరికో ఇది ఆశ్రయం ఇచ్చింది. అనేక మంది చిరు వ్యాపారులు దీని నీడలో వ్యాపారాలు నిర్వహించుకునేవారు. అయితే ఎండిపోయిన ఈ చెట్టు ఎవ్వరి మీదైనా కూలిపోతుందనే ఉద్దేశంతో తొలగించారు. గ్రామంలో ఈ నెల 9న లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆర్డీవో కృష్ణనాయక్ ఆదేశాల మేరకు చెట్టును తొలగించారు. అయితే చెట్టును తొలగించిన ప్రాంతంలో మరో చెట్టును నాటడం మరిచారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: మండలంలోని కొన్ని గ్రామాలకు శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం తెలిపారు. 11 కేవీ పోలవరం కెనాల్ ఫీడర్ వర్క్ కోసం సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, పెద కొండేపూడి, అచ్చయ్యపాలెం, చీపురుపల్లి, దేవీపట్నం మండలం నేలకోట గ్రామాలకు ఆ సమయంలో విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రారండోయ్ తీర్థం చూద్దాం

- లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు
- 9 నుంచి 15 వరకూ నిర్వహణ
- 10న రథోత్సవం, రాత్రి కల్యాణం
- కోరుకొండలో ఆధ్యాత్మిక సందడి



కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం

మధురపూడి: కోరుకొండలోని పారిజాతగిరిపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి కల్యాణ వేడుకలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. దత్తత దేవస్థానమైన అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మార్చి 9 నుంచి 15వ తేదీ వరకూ ఏడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని పనులను శరవేగంగా చేస్తున్నారు. నరసన్న తీర్థానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తులకు వసతులు

ఉత్సవాల నేపథ్యంలో దేవస్థానంలోని ఆలయాలకు, గోపురాలకు రంగులు వేశారు. ఈ నెల 10వ తేదీన జరిగే రథోత్సవం కోసం రథానికి అవసరమైన మరమ్మతులు నిర్వహించారు. ఆ రోజు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా బారికేడ్ల ఏర్పాటు, డ్రైనేజీలోకి రథం చక్రాలు వెళ్లకుండా ఇసుక బస్తాలతో మూయనున్నారు. ఆ రోజు రాత్రి 9 గంటలకు జరిగే స్వామివారి కల్యాణం కోసం మంటపాన్ని తీర్చిదిద్దారు. నరసన్న ఉత్సవాల సందర్భంగా స్థానిక రెడ్డి పంతులు సత్రంలో భక్తులకు భోజన వసతి కల్పిస్తారు. ఈ మేరకు సత్రం అధికారులు ఏర్పాట్లు చేశారు. చాలా మంది భక్తులు మెట్ల మార్గంలో స్వామివారి దర్శనానికి వెళతారు. వారందరి కోసం ఆ 600 మెట్లకు కూల్ పెయింటింగ్ వేస్తున్నారు. ఎండలు ఎక్కువగా కాస్తున్న నేపథ్యంలో భక్తులకు ఉపశమనం కోసం ఈ చర్యలు తీసుకుంటున్నారు.

తొలి రోజు పుట్టమన్ను సేకరణ

ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు అయిన ఈ నెల 9న స్థానిక దేవుని కోనేరు నుంచి పుట్టమన్ను సేకరిస్తారు. అలాగే అంకురార్పణ, ధ్వజారోహణ జరుగుతోంది. దీంతో తీర్థం ప్రారంభమవుతుంది. 10న రథోత్సవం, ఆ రోజు రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి రథోత్సవం సోమవారం మధ్యాహ్నం 1.56 గంటలకు మొదలవుతుంది. బ్యాండు మేళం, కోలాటం, తీన్‌మార్, శక్తి వేషధారణలు, గరగ నృత్యం, పొడుగు మనుషులు, కేరళ డ్రమ్ము వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం జరుగుతుంది.



కొండపైన స్వామివారి ఆలయం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

కల్యాణానికి సర్వం సిద్ధం

వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామివారు పుర వీధులలో తిరుగుతూ భక్తులకు దర్శనమిస్తారు. ఏళ్ల తరబడి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొంటారు. రథోత్సవం అనంతరం స్వామి, అమ్మవార్లకు మంగళ స్నానాలు చేయిస్తారు. పట్టు వస్త్రాలతో పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడిలా అలంకరిస్తారు. కల్యాణ మంటపంలో వైఖానస ఆగమ, శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం కల్యాణం జరుగుతుంది. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ రంగరాజ బట్టర్, వైఖానస పండితుడు పాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో, అర్చక స్వాములు పెదపాటి, పెద్దింటి, పెరవలి కుటుంబీకుల స్వీయ పర్యవేక్షణలో కల్యాణ వేడుకలు జరుగుతాయి.

పలు కార్యక్రమాలు

ఉత్సవాల నేపథ్యంలో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకూ నాలుగు రోజుల పాటు ఉదయం, సాయంత్రం ఆరాధన, సర్వదర్శనం, గ్రామ బలిహరణ, సేవాకాలం, తీర్థ ప్రసాదాల గోష్టి నిర్వహిస్తారు. సాయంత్రం వేళల్లో గరుడ, ఆంజనేయ, గజ, శేష వాహనాలపై స్వామి వారికి గ్రామోత్సవం జరుపుతారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 13న రంగనాథస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతోంది. 14న చక్ర తీర్థం సందర్భంగా దేవుని కోనేటికి స్వామివారితో పాటు, పద్మనాభ స్వామి, చక్రపెరుమాళ్లు స్వాములను తీసుకువస్తారు. అదే రోజు సాయంత్రం అద్దాల సేవ అనబడే ఊంజల్ సేవ జరుగుతుంది. 15వ తేదీన ఆలయంలో శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు.

పూర్తయిన ఏర్పాట్లు



కోరుకొండ నరసన్న తీర్థానికి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. తాగు నీరు, వైద్య శిబిరాలు, విద్యుత్, ఇతర వసతులు ఏర్పాటు చేశాం. అత్యవసర సమయంలో ఉపయోగపడేలా అంబులెన్సులు ఉంచుతాం. దేవదాయశాఖకు చెందిన వందల మంది ఉద్యోగులు, సిబ్బందితో పాటు, అన్నవరం దేవస్థానం అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తారు. కొండ పైన, కింద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. ఊరంతా బారికేడ్లు ఏర్పాటు చేశాం. నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తారు.

– వీర్ల సుబ్బారావు, డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి, అన్నవరం దేవస్థానం

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో భారతి

సీతానగరం: వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎంపీడీవో ఎం.భారతి సూచించారు. సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భారతి మాట్లాడుతూ పీ4 సర్వేను సత్వరమే పూర్తి చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సరఫరా సక్రమంగా జరపాలన్నారు. ఈవోపీఆర్డీ మూర్తి మాట్లాడుతూ తాగునీటి పైప్‌లైన్లకు లీకేజీలు లేకుండా చూసుకోవాలని, వేసవిలో దాహార్తిని తీర్చేలా చలివేంద్రాలు నెలకొల్పాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్ మాట్లాడుతూ వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పని సరిగా శుభ్రపర్చాలన్నారు. పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో రాయుడు మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగరాదన్నారు. సమావేశంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, ఏవో కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 40 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో గురువారం ఇంటర్ మొదటి సంవత్సరం మ్యాథ్స్ 1-ఎ, బోటనీ పేపర్ 1, సివిక్స్ పేపర్ 1 పరీక్షలు జరిగినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటిండెంట్లు బి.హేమ, ఎస్.మాధురి తెలిపారు. మొత్తం 763 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఏ సెంటర్‌లో 25, బి సెంటర్‌లో 15 మంది గైర్హాజరయ్యారన్నారు. డిపార్టుమెంటల్ అధికారులుగా ఏపీఆర్‌వీ ప్రసాద్, ఎంవీఎస్ కృష్ణ వ్యవహరించారు.

పీ4 సర్వేపై శిక్షణ

బిక్కవోలు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు పీ4 సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన ఈ కార్యక్రమంలోని ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడతూ సచివాలయం సిబ్బంది ఈనెల 8 నుంచి 18 వరకు ఈ సర్వే చేయాలన్నారు. పారదర్శకంగా సర్వే చేయడం వల్ల అసలైన లబ్ధిదారులను గుర్తించే అవకాశం లభిస్తుందన్నారు. ఎంవోటి సూరిశెట్టి సురేష్, ఈవోపీఆర్డీ జాన్ మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ'లో అగ్ని ప్రమాదం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలోని శివారు ప్రాంతంలో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. భవన నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతంలో రాలిన పడిన ఎండుటాకులు అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు లేశాయి. రాజమహేంద్రవరం అగ్నిమాపక దళం హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను వ్యాప్తి చెందకుండా నిరోధించారు. ఈ ప్రమాదం వల్ల ఎటువంటి నష్టం వాటిల్లలేదని జిల్లా అగ్నిమాపక దళాధికారి మార్టిన్ లూథర్‌కింగ్ తెలిపారు. కాల్చిపారేసిన సిగరెట్ పీక కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

శలాకకు ప్రతిష్టాత్మక పురస్కారం

సీటీఆర్ఐ: మహామహోపాధ్యాయ, రాష్ట్రపతి పురస్కార గ్రహీత ప్రాచార్య శలాక రఘునాథ శర్మ మరో పురస్కారానికి ఎంపిక అయ్యారు. హైదరాబాద్‌కు చెందిన శాంతా బయోటెక్ సంస్థ అధినేత డాక్టర్ కె.వరప్రసాద రెడ్డి స్థాపించిన శాంతా వసంత ట్రస్టు ఆధ్వర్యంలో అందించే వరప్రసాద్ రెడ్డి ఉత్తమ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఈ నెల 9న జరిగే కార్యక్రమంలో ఆయనకు పురస్కారం ప్రదానం చేస్తారు.

అన్నపూర్ణకు ఉత్తమ మహిళా రైతు పురస్కారం

మధురపూడి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామానికి చెందిన వేమగిరి అన్నపూర్ణ ఉత్తమ మహిళా రైతు పురస్కారం అందుకున్నారు. గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి గురువారం ఈ అవార్డును ప్రదానం చేశారు. ప్రకృతి వ్యవసాయం, వర్మీ కంపోస్టు తయారీ, సేంద్రియ వ్యవసాయం వంటివి ఎంతో ఆసక్తిగా నిర్వహిస్తున్నారు. ఇందుకు గాను ఆమె పురస్కారం అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న మహిళా రైతు అన్నపూర్ణ

దాడి ఘటనలో నిందితులకు జరిమానా

సీతానగరం: కారును ధ్వంసం చేసిన ఘటనలో మునికూడలికి చెందిన తీగిరెడ్డి ప్రసాద్, దాసరి జానకి రామ్‌లకు రూ.5,500 చొప్పున జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం సెవంత్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.బాబు గురువారం తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలలు జైలుశిక్షను విధించారు. వివరాల్లోకి వెళితే.. 2022 ఫిబ్రవరి 6న కొవ్వూరుకు చెందిన ఐదుగురు కారులో దేవీపట్నం మండలం గండిలో కొలువైన పోశమ్మ గుడికి వెళ్లారు. దర్శనం అనంతరం ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. అయితే ఆ కారును రాజంపేట వద్ద తీగిరెడ్డి ప్రసాద్, జానకి రామ్ అడ్డుకున్నారు. తమకు దారి ఎందుకు ఇవ్వలేదంటూ కారును ధ్వంసం చేశారు. కారులోని వారిపై కర్రలతో దాడి చేశారు. కొవ్వూరుకు చెందిన కంచుమర్తి సత్తిబాబు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శుభశేఖర్ కేసు నమోదు చేశారు. పీపీ ఓలేటి మహాలక్ష్మి కేసు వాదించగా, మేజిస్ట్రేట్ బాబు పైశిక్ష విధించారు. ఎస్సై రామ్ కుమార్ పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ ఎస్కేబీఎం షరీఫ్ సాక్షులను సకాలంలో హాజరుపర్చినందుకు కోరుకొండ సీఐ సత్యకిషోర్ అభినందించారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

కడియం: తడి, పొడి చెత్త సేకరణపై గ్రామ పంచాయతీల్లో ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి అన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ పంచాయతీ అధికారి ఎం.నాగలతతో కలిసి గురువారం వేమగిరి, కడియం, జేగురుపాడు, మురమండ, దుళ్ల, వీరవరం, కడియపుసావరం గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో తడి పొడి చెత్త సేకరణకు సంబంధించి నిర్వహిస్తున్న ఇంటింటికి అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. వాటి పనితీరును మెరుగుపరిచేందుకు సంబంధిత గ్రామ కార్యదర్శులకు సూచనలు చేశారు. డీపీవో శాంతామణి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 150 గ్రామ పంచాయతీలను ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్ఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఈ నెల మూడో వారం నుంచి ఈ సిస్టమ్ ద్వారా ప్రభుత్వం నేరుగా ఆయా ఇంటి యజమానులకు ఫోన్ చేసి అభిప్రాయ సేకరణ జరుపుతుందన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ ఎలా జరుగుతుంది, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరు ఎలా ఉంది అనే అంశాలను తెలుసుకుంటుందన్నారు.



పంచాయతీ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీపీవో శాంతామణి

కంటి వైద్యశిబిరం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి సచివాలయం వద్ద గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని ఆకీరా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన శిబిరానికి 92 మంది వచ్చారు. వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఆకిరా హాస్పిటల్‌కు చెందిన ఇద్దరు డాక్టర్లతో పాటు, మరో ముగ్గురు సిబ్బంది సేవలందించారు. కార్యక్రమంలో సెక్రటరీ తాతపూడి జాకబ్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పందలపాకలో ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని సరిపల్లిపేటలో గురువారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తామర్ల నాగేశ్వరరావు, శ్రీదేవి దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ముందుగా గణపతి విగ్రహాన్ని, అనంతరం ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

వైర్‌లెస్ కమ్యూనికేషన్‌పై అవగాహన



వైర్‌లెస్ కమ్యూనికేషన్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

సీతానగరం: రఘుదేవపురంకు చెందిన ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు గురువారం పోలీస్ స్టేషన్‌లో వైర్‌లెస్ కమ్యూనికేషన్‌పై అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. ఎస్సై డి.రామ్ కుమార్ వైర్‌లెస్ కమ్యూనికేషన్ సిస్టమ్ గురించి వివరించారు. ఖైదీల సెల్, ఎఫ్ఐఆర్, ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ధనదుర్గ అమ్మవారికి సారె సమర్పణ



108 వంటకాల సారెను ఊరేగిస్తున్న భక్తులు

సీతానగరం: ధనదుర్గ అమ్మవారి జాతర సందర్భంగా గురువారం 108 వంటకాలతో సారె సమర్పించారు. సీతానగరం పంచాయతీ పరిధి వెలమపేటలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 108 రకాల వంటకాలను 250 బిందెలలో ఉంచి మహిళలు ఊరేగింపు జరిపారు. వెలమపేట, పోలీస్ స్టేషన్, బస్టాండ్ సెంటర్, నాలుగు బొమ్మల సెంటర్ నుంచి ఆలయానికి చేరుకున్నారు. రాత్రి గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, వివిధ దేవతామూర్తుల వేషధారణ మధ్య పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. ఎస్సై డి.రామ్‌కుమార్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

రాజానగరం: ఎంచుకున్న లక్ష్యాలను సాధించడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ బి.విజయ కుమార్ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులతో గురువారం సమావేశమయ్యారు. మానవాళి అంతా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అడవులపై ఆధారపడి జీవనం సాగిస్తోందన్నారు. ఈ తరుణంలో ప్రకృతి సంపదను కాపాడుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. పర్యావరణ వ్యవస్థ ద్వారా లభిస్తున్న వివిధ సేవలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ శాంతిస్వరూప్, హెచ్ఓడీ బలరామ్ భగత్ తదితరులు పాల్గొన్నారు.

నారీ ఫెస్ట్.. సూపర్ హిట్





ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

- 'నన్నయ'లో అంబరాన్నంటిన సంబరాలు
- ఉత్సాహంగా సాగిన పోటీలు
- కేరింతలు కొట్టించిన సాంస్కృతిక ప్రదర్శనలు

రాజానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మూడు రోజులుగా అంబరాన్నంటేలా జరిగిన 'నారీ ఫెస్ట్ 2025' ఉత్సవాలు గురువారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థినులతో పాటు బోధన, బోధనేతర విభాగాల్లోని మహిళా సిబ్బంది సైతం ఉత్సాహంతో పాల్గొని, వివిధ పోటీలలో తమ సత్తా చాటే ప్రయత్నం చేశారు. ముగింపు కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీతో పాటు కలెక్టరు పి.ప్రశాంతి, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఏడీ డాక్టర్ పద్మ విశ్వనాథుల, కేంద్ర కారాగార డీఎస్పీ వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ



వెల్ బేబీషోలో బహుమతి అందుకుంటున్న చిన్నారి